


# నిత్య

ఆంగ్ల మూలం: ఆర్. కె. నారాయణ్

తెలుగు అనువాదం: చింతపట్ల సుదర్శన్

'నిత్యా! శుక్రవారం పొద్దున ఆరు గంటలకే బస్సు' అన్నాడు తండ్రి.

ప్రయాణానికి ఏర్పాట్లు జరిగిపోసాగేయి. ముగ్గురికీ ఓ బ్యాగులో భోజనం, ఓ బుట్టలో కొబ్బరికాయ, పూలు, అగరువత్తులూ సిద్ధం చేసింది తల్లి. ప్రయాణాన్ని గురించే తల్లీదండ్రీ మాట్లాడుకోవడం వినిపిస్తూ వుండేది నిత్యకి. నిత్య కాఫీ కోసం వంటింట్లోకి వెళ్తే తల్లి "మొక్కు అన్నాక తీర్చుకోక తప్పదు" అని పదే పదే అంటూ వుంటే మాట మార్చి అక్కడ్నుంచి పారిపోయేవాడు నిత్య.

నిత్యకి రెండేళ్ళ వయసప్పుడు కోరింత దగ్గువచ్చింది. వాడి ఆరోగ్యం కుదుట పడితే గుట్ట మీద గుడికి వచ్చి వాడి తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకున్నారు వాళ్ళు. అయితే ఆ సంగతి చాలా కాలందాకా మరిచేపోయారు. ఓసారి పాత డైరీ పేజీలు తిరగేస్తుంటే దేవుడికి తామిచ్చిన మాట రాసి వుంటం కనిపించింది తండ్రికి. దేవుడికి రూపాయిబిళ్ళ ముడుపు కట్టిన సంగతీ (ఆ బిళ్ళ యిప్పుడు కనపడ్డంలేదు కాని) గుర్తొచ్చింది తల్లికి. ఇప్పుడు నిత్యకి యిరవయ్యేళ్ళు. మొక్కు తీర్చుకోవడం యిప్పటికే చాలా ఆలస్యమైందని, యింక వాయిదా వెయ్యడానికి వీల్లేదని యివాళ నిత్యతో ఖచ్చితంగా చెప్పేశాడు తండ్రి.

"మీరు ఇరవై ఏళ్ళ కింద మొక్కుకున్న మొక్కుతో నాకు సంబంధం లేదు. నన్నడక్కుండా నా జుట్టు యిస్తానని మొక్కుకునే హక్కు మీకు లేదు" అన్నాడు నిత్య.

"అప్పుడు నీకు రెండేళ్ళే!" అన్నాడు తండ్రి.

"నా తలని మీ ఇష్టం వచ్చినట్టు వాడుకోగలిగిన వయస్సులో తీర్చి వుండాల్సింది మొక్కు" అన్నాడు కొడుకు.

'కానీ నువ్వు చాలా రోజులు జబ్బుపడ్డావు. బ్రతుకుతావో లేదో అనుకున్నాం'

'నేను బ్రతికాను. అంటే... నాకు వచ్చిన జబ్బు చచ్చి వూరుకుందన్న మాట. దీంట్లో దేవుడు చేసిందేముంది. పోనీ చేశాడు... అయితే... నా జుట్టు కావల్సి వచ్చిందా దేవుడికి'

నిత్య యిలా మాట్లాడతాడనుకోలేదు తల్లీదండ్రీ. అవాక్కయిపోయేరు. 'వొద్దురా... పాపం... అలా మాట్లాడకు' అని బతిమాలింది తల్లి. తండ్రి కోపంగా 'తల తిక్కగా మాట్లాడకు. మా మొక్కు మన్నించి ఆయన వచ్చి నిన్ను రక్షించివుండకపోతే...' తండ్రి వాక్యం పూర్తి చేయకముందే

'బేరం కుదుర్చుకున్నారా?' అని బిగ్గరగా అరిచాడు నిత్య.

'అవును. బేరమే! యింక వెనక్కి పోయేదే లేదు...' అన్నాడు తండ్రి నిశ్చయంగా.

'ఎందుకు పోదు... గుండు గీకితే పోయేది నా జుట్టే... అసలు మీది కాని వస్తువుతో బేరసారాలేమిటసలు' అన్నాడు నిత్య వెనక్కి పోకుండా.

'నీ క్షేమం కోసమే కదా!'

నేనడిగానా? తల్లి కన్నీళ్ళు పెట్టుకుంది. తండ్రి 'నువ్వు నాస్తికుడివి, పాపాత్ముడివి. నా కడుపున చెడబుట్టావు' అన్నాడు.

వాదన ఎంత దూరం వెళ్ళేదో కానీ సరిగ్గా అప్పుడే ఇంట్లోకి అరుస్తూ జొరబడ్డాడు తాగుబోతు ఇంజనీరు. ఆ వీధిలో వుంటూ తాగుడు కారణంగా కుటుంబాన్నీ ఉద్యోగాన్నీ పోగొట్టుకున్నవాడు.

నిశ్శబ్దం! గప్‌చిప్! నాకు ఒక్క పెళ్ళాం కూడా లేదు. ఒక్కొక్కళ్ళకి యిద్దరు ముగ్గురుంటారు' అని అరుస్తూ నుంచున్న అతన్ని బయటకి తోసుకుంటూ వెళ్ళిపోయాడు నిత్య.

***

శుక్రవారం రానే వచ్చింది. మార్కెట్ గేట్ దగ్గర పసుపురంగు బస్సు ఆగనే ఆగింది. బస్సులో నిత్యని తన పక్కన కూచోబెట్టడంలో విజయం సాధించాడు తండ్రి. బస్సు ఎల్లమాన్ నుంచి న
ల్లప్ప తోట దాటి నది వొడ్డున నీళ్ళు పైకి చిమ్ముతూ పోసాగింది. డ్రైవర్ బస్సుని ఎంత నిర్లక్ష్యంగా నడపసాగేడంటే జనం ఈ పక్కనించి ఆ పక్కకి, పైనించి కిందకి వూగిసలాడేరు. 'ఛీ! ఏం ప్రయాణమిది' అని విసుక్కున్నాడు నిత్య.

'ఓపిక వుండాల్రా బాబూ! మనది పేద దేశం. బొంబాయి, మద్రాసులో వున్న సౌకర్యాలు రమ్మంటే వస్తాయా' అన్నాడు తండ్రి.

బస్సు నిండా జనం. వాళ్ళని జరగండి పైకి జరగండి అనరుస్తూ ఫుట్ బోర్డు మీద కండక్టర్. దుమ్ము రేపుకుంటూ, కీచుమంటూ బస్సు ఆగినప్పుడల్లా దిగేవాళ్ళు... ఎక్కేవాళ్ళు. బస్సు వో చోట ఆగినప్పుడు 'మీరు ఇక్కడ దిగి కొండ మీదకి నడిచివెళ్ళాలి' అన్నాడు కండక్టర్. జనాన్ని తోసుకుంటూ కిందకి దిగారు నిత్య, తల్లీ దండ్రీ. బస్సు బయల్దేరబోతుంటే డ్రైవర్ని అడిగాడు తండ్రి.

'మళ్ళీ రిటర్న్ ఎప్పుడు?'

'ఐదు... ఆరు... ఏడు గంట్లకి... తప్పితే రేప్పొద్దున' అంటూ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయాడు డ్రైవర్.

***

చుట్టూ పొలాలు... ఆ పైన... కొండ... కొండ మీద గుడీ కనిపించాయి. కానీ ఎంత దూరమో పసిగట్టడం కష్టం. పొలాల మధ్య కాలిబాట. తండ్రి ముందు, తల్లి వెనక మధ్యలో నిత్య నడక ప్రారంభించారు. పారిపోతానేమోనని ఇద్దరి మధ్య తన్ను నడిపిస్తున్నారనుకున్నాడు నిత్య. అలా వో గంటసేపు నడిచి కొండ కింద ఉన్న చిన్న పల్లెకి చేరుకున్నారు వాళ్ళు. దేవుడు ప్రతిచోటా వుంటాడు కదా. యింత దూరం రావడమేమిటి ఈ నడకేమిటి? వినాయక వీధిలో మన యింటికే వచ్చి గడ్డం గీకే మంగలికి తల వప్పగించేవాణ్ణి కదా అందామనుకున్నాడు నిత్య. నిత్య మనసులో అనుకున్నది తండ్రికి తెల్సిపోయిందేమో 'కొండ మీద గుడి ఐదు వందల ఏళ్ళ కింద మన పూర్వీకులు కట్టించిన గుడి. ఈ కొండ మీద కుమారస్వామి వో రాక్షసుడ్ని సంహరించాడు. ఆ రాక్షసుడి పేరు... గుర్తు రావడం లేదు' అన్నాడు.

'రాక్షసుడు... రాక్షసుడే... పేరేదయితేనేం?' అన్నాడు నిత్య.


'ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చోళుడు ఈ గుడికి మన పూర్వీకులని ధర్మకర్తలుగా నియమించాడు'

'నువ్వు చెప్పేది నిజమేనా?'

ప్రతిదాన్ని ప్రశ్నించడం అలవాటయిపోయింది నీకు'

'ఊరికే... తెల్సుకుందామని... అంతే'

'శిలా స్తంభాల మీద, తాటాకుల మీద వున్న విషయాల్ని పండితులు చదివి తేల్చిన విషయమిది. నువ్వొక్కడివే తెలివైనవాడిననుకోకు. గుళ్ళో వున్న వో తాటాకులో మా ముత్తాత పేరు రాసుంది. ప్రతి ఏడూ రథోత్సవం ఖర్చులు మా కుటుంబంవారే చూసుకునేవారు. నేనూ ప్రతిఏటా ఇరవై కిలోల బియ్యం రెండు వందల రూపాయలు సమర్పించుకుంటున్నాను'



ఊరి పొలిమేరలోకి వచ్చాక తండ్రి నడక వేగం తగ్గించి 'అందరూ ఏమైపోయారు?' అన్నాడు. 'అరేయ్ రామా' అని బిగ్గరగా అరిచాడు. ఆ అరుపు విని బిల బిలమంటూ కొందరు ఆడవాళ్ళూ పిల్లలూ పరుగెత్తుకొచ్చా రు. మా ఇంటికి రండంటే మా ఇంటికి రండి అన్నారు. తర్వాత చూద్దాం...ముందు గుడికి వెళ్ళాలి గ్రామ పెద్దని పిలవండి' అన్నాడు తండ్రి.

అందరూ కోతలకు పోయిన్రయ్యా అంటూనే వో అబ్బాయి వైపు తిరిగి చూపుడు వేలుతో వాడి బుగ్గపిండి "ఉరుకు...ధర్మకర్త వొచ్చిన్రని చెప్పి రాముడ్ని పిల్చుకరా పో..." అంది. బాణంలా రివ్వున పరుగెత్తాడు వాడు. గ్రామస్తులు యిళ్ళల్లోకి

వెళ్ళి కూర్చుకునేందుకు బల్లలుతెచ్చి చెట్టునీడలోవేశారు. వో పండ్లగెల, పాలు తెచ్చి స్టూల్ మీదపెట్టారు. 'నాకుకావాలి' అంటూ నిత్య వో పండు అందుకోబోయాడు కానీ 'మొక్కు తీరాక' అని తండ్రి వారించాడు.

ఊరిపెద్ద వచ్చాడు. పలకరింపులయ్యేయి.'పూజారి ఎక్కడ? గుడి తెరిపించండి. మేము సాయంత్రం బస్సుకి వెళ్ళిపోవాలి' అన్నాడు తండ్రి.

'రాకరాక వచ్చారు. రాత్రికి సత్రంలో బస చెయ్యండి' అన్నాడు గ్రామ పెద్ద.సకాలేజీ మిత్రబృందం గుర్తుకు వచ్చింది నిత్యకి. మీరు వుంటే వుండండి నేను మాత్రం సాయంత్రం బస్సుకి వెళ్ళిపోతానన్నాడు నిత్య.

సరిగ్గా ఈ సమయంలో వూడిపడ్డాడు పూజారి. సన్నగా గడకర్రలా వూగుతూ వస్తున్న ఆ మనిషిని చూడ్డంతోటే గుర్తు పట్టవచ్చు. ముఖం మీద విబూది పట్టెలు వాటి మధ్య పెద్ద బొట్టు భుజమ్మీద ఎర్రశాలువ, చేతిలో ఇనుపచక్రంలో వేలాడుతున్న పెద్ద తాళంచెవీ. మనిషి సన్నగా వున్నా గొంతు మాత్రం ఖంగుమని మోగేదే.

వచ్చీ రావడంతోనే తండ్రిని మర్యాదగా పలకరించి తన కష్టాల చిట్టా విప్పాడు. గుళ్ళోవున్న బావి ఎండిపోయింది. వూడికతీయించాలి. తాళం చెవి ఒక్కోసారి తాళంలో యిరుక్కుపోతున్నది. బాగు చేయించాలి. రోజులు ఏమీ బాగాలేవు- పూజకి పూలు దొరకడంలేదు. కొండమీద జనం తోడేలుని చూశామని, చిరుతపులిని చూశామని అంటుండడంతో భక్తులెవరూ రావడం లేదు. అన్నీ వట్టి పుకార్లు! చిరుతలూ లేవు పులులూ లేవు అన్నాడు తండ్రి కొట్టిపారేస్తూ.

'మరి తోడేళ్ళ సంగతేమిటి?' అన్నాడు నిత్య. 'అంతా వుట్టి గ్యాసు' తమ పెద్దలు కట్టించిన దేవాలయం దగ్గర జంతువులు తిరగాడతాయని వప్పుకోడానికి ఆయన సిద్ధంగా లేడు. అందుకే విషయంలోకి వచ్చేశాడు.

'మా నిత్యకి గుండు చేయించాలి. నాయీని పిలిపించండి' అన్నాడు.

జనంలో వున్న వో చిన్న కుర్రాడివైపు తిరిగి పూజారి అన్నాడు.

'వెధవా గోళ్ళు కొరక్కు... చెరువుకట్ట మీదికి వెళ్ళి రాఘవన్‌ని పెట్టె తీసుకుని తక్షణం రమ్మను' అని అరిచాడు. వాడు రివ్వున పరుగెత్తాడు.

నిత్య చెప్పిందాన్ని పూజారి బలపరుస్తూ 'కొబ్బరికాయ పండ్లు అక్కడ వుంచి మీరు ఇవ్వగలిగిన దక్షిణయివ్వండి. అబ్బాయి చెప్పిందే చేద్దాం' అన్నాడు. నిత్య హాయిగా వూపిరి పీల్చుకున్నాడు. కానీ కొద్ది క్షణాల్లో అంతా తారుమారయింది.

కొండపైకి నడక మొదలయింది. పూజారి ముందు, వెనక నిత్య తల్లీ దండ్రీ ఆ వెనక జనం. కొండ ఏమంత ఎత్తయినది కాదు కానీ నిత్య తల్లి ఆయాసపడ్డది. అలుపు తీర్చుకోడానికి రెండు మూడు చోట్ల కూచుంది కూడా. సరిగ్గా దేవాలయం తలుపుల దగ్గర ఆగిపోయింది దారి. పూజారి తాళం తీశాడు. రెండు పెద్ద తలుపులని జనం తోసి తెరిచారు. లోపల రాతి స్తంభాల హాలు. గర్భగుడి. దానిచుట్టూ ప్రదక్షిణం చెయ్యడానికి దారి. గర్భగుడిలో ఎత్తైన అరుగుమీద విగ్రహం కనపడగానే తండ్రి గంభీరంగా ముఖం పెట్టాడు. తల్లి కళ్ళు మూసుకుని లోలోపల ఏదో చదువుకోసాగింది. పూజారి దీపం వెలిగించి విగ్రహానికి పూలు అలంకరించేడు. నాయీ కోసం వెళ్ళిన కుర్రాడు తలుపు దగ్గర్నించే బిగ్గరగా- 'నాయీ ఇంటికి తాళం వేసుంది' అన్నాడు.

'పక్కవాళ్ళని అడిగావా' అన్నాడు పూజారి.

'ఎక్కడికి వెళ్ళారో తెలీదన్నారు. వాళ్ళు సామానుతో బస్ స్టాండ్‌లో బస్సుకోసం నిలబట్టం చూశామని చూసినవాళ్ళన్నారు'

'ఇంత పెద్ద వూళ్ళో ఒక్కడే నాయీ వుంటం ఏమీ బాగులేదు. అయినా ఇలా చెప్పా పెట్టకుండా ఇష్టం వచ్చినట్టు వెళ్ళిపోవడమేనా' అనరిచాడు తండ్రి కోపంగా. వూరందరికీ వొక్కడే నాయీ, వొక్కతే పద్మావతి అని గొణిగాడు. 'ఉష్! ఏమిటా మాటలు గుళ్ళో వున్నాం మనం అంది తల్లి.(పద్మావతి ఆ ఊళ్ళో వున్న ఏకైక వేశ్య అని ఆమెకు తెల్సును)

ఆ మాటన్న ఆమె వైపు కోపంగా చూశాడు తండ్రి. కానీ అంత మందిలో ఏమీ అనలేక నిత్యవైపు చూశాడు. నిత్య ముసి ముసి నవ్వులు ఆయనకి వెర్రి ఎక్కించేయి. ఊరిపెద్ద 'రాఘవన్ పెళ్ళిళ్ళకి సన్నాయి వాయిస్తే తప్ప పూట గడిచే పరిస్థితి లేదు... మరి. పైగా తరతరాల నించీ వస్తున్న సంప్రదాయం' అన్నాడు.

పూజారి గంట వాయిస్తూ హారతి యిస్తుండడంతో జనం మాటలు మాని కళ్ళు మూసుకున్నారు. గర్భ గుళ్ళోంచి పూజారి బయటకు వచ్చాడు. నాయీ లేకపోతే మొక్కు తీర్చుకోవడానికి శాస్త్రంలో ఏమి రాసి వుంది అన్నదాని మీద చర్చ జరిగింది.

పూజారి నిత్య తల వైపు చూస్తూ ఈ రోజుల్లో కుర్రాళ్ళు గుండు గీకుంచుకోవడానికి ఒప్పుకోవడంలేదు కదా! అంచేత మొక్కు తీర్చుకోవడానికి మరో పద్ధతి పాటిస్తున్నారు' అన్నాడు.

'పిచ్చి పిచ్చిగా పెంచుకున్న జుట్టుని మాత్రం ముట్టుకోనీయరు' అన్నాడు తండ్రి. 'నడి నెత్తిలో యింత జుట్టు గీకి మొక్కు అయిపోయింది అనవచ్చు... కానీ అది చిన్నప్పుడే చేయాలి. ఇప్పుడు శాస్త్రం వప్పుకోదు' అన్నాడు పూజారి. ఆ మాట విన్న నిత్య సంతోషంతో ఎగిరి దూకాలనుకున్నాడు కానీ తమాయించుకుని

'ఓ కత్తెర తెప్పించండి. నా జుట్టులో ముందు వైపునించి నాలుగు యించీలు తీసిస్తే దేవుడు సంతోషపడడూ' అన్నాడు. ఎవరూ మాట్లాడకపోవడంతో మళ్ళీ తనే 'అయినా యింత మందీ జుట్టు యిస్తే ఆ జుట్టంతా దేవుడెక్కడ దాచుకుంటాడు'

నిత్య చెప్పిందాన్ని పూజారి బలపరుస్తూ 'కొబ్బరికాయ పండ్లు అక్కడ వుంచి మీరు ఇవ్వగలిగిన దక్షిణయివ్వండి. అబ్బాయి చెప్పిందే చేద్దాం' అన్నాడు. నిత్య హాయిగా వూపిరి పీల్చుకున్నాడు. కానీ కొద్ది క్షణాల్లో అంతా తారుమారయింది. గుడి బైటనించే ఎవరో 'రాఘవన్ వస్తున్నాడు' అని అరిచారు. ఆ వెనుకే చేతిలో రేకుపెట్టెతో వూడిపడ్డాడు రాఘవుడు. అతని వళ్ళంతా చెమట పట్టింది. వగరుస్తూ వచ్చాడు. అక్కడవున్న వాళ్ళం దర్నీ తేరిపార చూశాడు. ఒక్క మాట మాట్లాడకుండా గుడి వెనక వైపు వున్న బావి దగ్గరికి వెళ్ళి, బనీను విప్పేసి నెత్తిమీద నీళ్ళు గుమ్మరించుకుని, అలాగే నీళ్ళు కారుతున్న వొంటితో వచ్చాడు.

'వీడికి అన్ని ఆచారాలూ తెల్సు. మొక్కు గుండు గీకడానికి స్నానం చెయ్యందే కత్తి పట్టుకోడు' అన్నాడు పూజారి రాఘవన్‌ని మెచ్చుకుంటూ.

దగ్గరే వున్న పొలంలో వో పసిపాప పుట్టు వెంట్రుకలు తీయడానికి వెళ్ళానంతే అన్నాడు రాఘవన్. పెండ్లి సన్నాయి వాయించడానికి వెళ్ళావన్నారు అన్నారెవరో జనంలోంచి.

'ఎవరన్నారామాట మా పక్కింటివాళ్ళేనా! వాళ్ళెప్పుడూ తప్పుడు కూతలే కూస్తారు. ధర్మకర్తగారు వస్తున్నారన్న సంగతి తెలిస్తే వెయ్యి బంగారు నాణాలు ఇస్తానన్నా ఒప్పుకోకపోయి వుందును. కుర్రాడు సైకిలు మీద వచ్చి చెప్పంగానే ఆ సైకిలే లాక్కుని ఎకాఎకీని వచ్చాను'.

ఇంత లావు శరీరాన్ని చిన్న పిల్లాడి సైకిలు మీద ఎలా మోసుకువచ్చాడబ్బా అనుకున్నాడు నిత్య.

అక్కడే వున్న రాతి చప్టా మీదకి ఎక్కి 'నేను తయారుగా వున్నాను' అన్నాడు రాఘవన్.

తండ్రి నిత్య చేయి పట్టుకుని 'రా! వెళ్దాం' అన్నాడు.

నిత్య తండ్రి చేయి విడిపించుకుంటూ

'నాలుగు ఇంచీల జుట్టు యివ్వడానికి మాత్రమే వప్పుకున్నాను. మీరు తీసుకోలేదు. యిప్పుడింక ఏమీ ఇచ్చేది లేదు' అన్నాడు.

'తప్పు అలా అనకూడదు నిత్యా. యిక్కడ దేవుడు వున్నాడు. మనం దేవుడికి మొక్కు బాకీ వున్నాం' అంది తల్లి.

'కావలిస్తే నానకి గుండు గీకించి మొక్కు తీర్చుకో నా వల్లకాదు'

నాయీ బతిమాలాడు. పూజారీ అనేక విధాల బతిమాలాడు. 'అమ్మ నాన్నని బాధపెట్టవచ్చునా నాయీ రడీగా వున్నాడు. క్షణాల్లో అయిపోతుంది' అన్నాడు పూజారి నిత్య కొంచెం మెత్తబడ్డాడనుకుని-

'కానీ నా తల రడీగా లేదు. యింతకుముందు మీరే అన్నారు కదా నాలుగు ఇంచీల జుట్టు తీసుకుంటామని. ఇప్పుడు తల మొత్తం కావాలంటున్నారు. మీకసలు లాజికుందా! రీజనింగుందా! ఓ మాట మీద నిలబడరు కదా! ఇలాంటి వాళ్ళని ఆ దేవుడెట్లా సహిస్తున్నాడో. ఇప్పుడు నేను నా మనసు పూర్తిగా మార్చుకున్నాను. ఒక్క ఇంచీ జుట్టు కూడా ఇవ్వను. ఇవ్వనుగాక యివ్వను' అన్నాడు నిత్య ఉక్రోషంగా. పూజారితో ఇలాగేనా మాటాడ్డం అని తల్లీ దండ్రీ ఒకేసారి గట్టిగా అరిచారు.

నిత్యకి యిప్పుడు కోపంగానే కాదు. ఆకలిగా కూడా వుంది. ఊరివాళ్ళు యిచ్చిన అరటిపళ్ళల్లో ఒక్కటి కూడా తిననీయలేదు వీళ్ళు అనుకుంటూ తల్లీదండ్రుల వైపు కోపంగా చేశాడు.

ఏం చేయాలో అర్థంకాక వాళ్ళు అతనివైపు నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయారు. నిత్య కాలి మడమ మీద గిర్రున వెనక్కి తిరిగి బయటకు పరుగెత్తుతూ 'మీ కోసం బస్సుస్టాప్‌లో వెయిట్ చేస్తాను. బస్సు వచ్చేంతవరకే సుమా!' అని కేక పెట్టాడు. •